క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ కనకరాజుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం గాజువాకకు చెందిన ఆకుల అప్పలసూరి అనే దాత రూ. లక్ష విరాళం ఇచ్చారు. సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు దాతకు బాండ్ అందజేయడంతో పాటు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

గొన్నా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

అగనంపూడి: అగనంపూడి దరి ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలోని గొన్నా ఇంజినీరింగ్ కళాశాలకు నాక్-ఏ గ్రేడ్ లభించింది. కళాశాలలో బోధనా పద్ధతులు, వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల వంటివి పరిశీలించిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) కమిటీ ఏ గ్రేడ్‌కు ఎంపిక చేసినట్లు కళాశాల చైర్‌పర్సన్ గొన్నా పూజిత హనీష తెలిపారు. కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పెంటమాంబ పండగ మహోత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్ లోవ గ్రామ దేవత పెంటమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి పుట్టిల్లులో కలశ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ మేరకు అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, తిప్పల నితీష్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌వై నాయుడు, బొడ్డు గోవింద్, లోకేష్, లాలం చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై శిక్షణ



ప్రసంగిస్తున్న ప్రాంతీయ సంచాలకుడు విజయ భాస్కర్

గాజువాక: ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో శనివారం శిక్షణ నిర్వహించారు. పాఠశాలల నిర్వహణలో స్కూల్ కరస్పాండెంట్లు పాటించాల్సిన విధి విధానాలు, నిర్వహించాల్సిన రికార్డులపై పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడు విజయ భాస్కర్ వివిధ సూచనలు చేశారు. ప్రతీ యాజమాన్యం సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఎంఈవో విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థుల నమోదు, అడ్మిషన్ రికార్డు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్‌లను రాసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత, జిప్సా అధ్యక్ష కార్యదర్శులు పాలవలస భాస్కరరావు, బి.శ్రీనివాస్, ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, జగ్గారావు, జగన్, మురళి, మౌళి పాల్గొన్నారు.

మలుపు.. ముప్పు

- ప్రమాదాలకు నిలయంగా గంగవరం రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- వాహనచోదకుల్లో ఆందోళన



హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్న గంగవరం రోడ్డు మలుపు



ప్రమాదకరంగా రోడ్డు మలుపు



గంగవరం రోడ్డులో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదం (ఫైల్)



ప్రమాదకరంగా మారిన గంగవరం రోడ్డు

పెదగంట్యాడ: ఆ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిపోతోంది. ఇటు పెదగంట్యాడ, అటు వెంకన్నపాలెం, అలాగే గంగవరం వెళ్లే రహదారి గుండా ప్రయాణం చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకుంటోంది. పెదగంట్యాడ నుంచి గంగవరం వైపు వెళ్లే రహదారిలో వెంకన్నపాలెం కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో వాహనచోదకులు, పాదచారుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు గంగవరం పోర్టు, ఇంకోవైపు మత్స్యకారులు నివాసం ఉండే అనేక కాలనీలు.. మరోవైపు ఆటోనగర్‌కు చెందిన అనేక పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, వ్యాపార లావాదేవీలు, ఇతర కూలి పనుల నిమిత్తం గాజువాక వచ్చి వెళ్లే కాలనీవాసులు నిత్యం అదే రహదారి గుండా ప్రయాణం చేస్తూ ఉంటారు. అంతేకాకుండా ఆ కూడలి వద్దకు వెళ్లే వాహనదారులకు ఎవరు ఎటునుండి వస్తున్నారో తెలియని పరిస్థితి. దీంతో ఒకరినొకరు ఢీ కొనడం, గాయాల పాలవడం సాధారణమైపోయింది.

దట్టమైన ముళ్లపొదలు

రహదారులకు ఇరువైపులా దట్టమైన ముళ్ల పొదలు ఉండడంతో పాటు గుబురుగా ఉన్న పొదలు ఎదుట వాహనాన్ని కనపడనీయకుండా అడ్డుపడుతున్నాయి. అందువల్ల ఒకరినొకరు తప్పించుకోలేక ఢీకొంటున్నారు. దీనికి తోడు గంగవరం పోర్టులో వేలాది మంది ఉద్యోగులతో పాటు వివిధ సరకులు రవాణా చేసే వాహనాలు కూడా అధిక సంఖ్యలో ప్రయాణం చేయడం వల్ల మరిన్ని ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. వాహనాల వేగాన్ని నిలువరించడానికి, వాహనదారుడిని అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే ఇటువంటి ప్రమాదాలు సంభవించడం.. తద్వారా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆ ప్రాంతీయులతో పాటు వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు.

కానరాని చర్యలు

ఈ రహదారి ఇంత ప్రమాదకరంగా ఉన్నా పోలీసులు మాత్రం ప్రమాదాలను అరికట్టేలా చర్యలు చేపట్టడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఉన్నా ప్రయోజనం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్ బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు చేపట్టపోవడంతో ఇటీవల యారాడ నుంచి గాజువాక వైపు వేగంగా వస్తున్న ఓ కారు రోడ్డు పక్కన నిలబడి ఉన్న వారిని ఢీకొట్టిందని చెబుతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు విధులు కూడా నిర్వర్తించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొని ఉంటుందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



ఈ రోడ్డులో నిత్యం వేలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గంగవరం గ్రామస్తులకు కూడా ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాఫిక్ సమస్య కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై పోలీసులు దృష్టి సారించాలి.

–సత్తిబాబు, గంగవరం

స్టాపర్లు ఏర్పాటు చేస్తాం



గంగవరం రోడ్డులో స్టాపర్లను తొందరలోనే ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. స్టాపర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను కొంతమేర నివారిస్తాం. స్టాపర్ల కోసం జీవీఎంసీకి లేఖ రాశాం.

–ఉమా మహేశ్వరరెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ, న్యూపోర్టు

ఒలింపిక్స్‌లో భారత్ గెలుపు కోరుతూ..



ఒలింపిక్స్‌లో భారత్ విజయం కోరుతూ నినదిస్తున్న లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు, డీఎస్‌డీవో రమణ

విద్యార్థుల శుభాభినందనలు

అగనంపూడి: ఒలింపిక్ గేమ్స్‌లో భారత్ క్రీడాకారులు రాణించి పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌డీవో) అనకాపల్లి ఆధ్వర్యంలో ముందుగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. డీఎస్‌డీవో ఎల్.వి.రమణ మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభాపాటవాలతో ప్రపంచదేశాల్లో మన దేశ కీర్తి పతాక ఎగురుతోందన్నారు. బాక్సింగ్ కోచ్ షేక్ రెహ్మాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, పీడీ పి.లక్ష్మి పాల్గొన్నారు.

ఒలింపిక్ వలయాల నమూనా



ఒలింపిక్ వలయాల నమూనాలో విద్యార్థులు

పెదగంట్యాడ: ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాల పంట పండించాలని ఆకాంక్షిస్తూ నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఒలింపిక్ వలయ ఆకారంలో ఏర్పాటై శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నారాయణరావు, అప్పలరాజు, వరలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

వర్ధంతి సందర్భంగా మిసైల్ మ్యాన్‌కు ఘన నివాళులు



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

గాజువాక: భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తి ప్రదాత అని వక్తలు కొనియాడారు. నిస్వార్థంగా దేశానికి సేవలందించడమే కాక దేశ ప్రథమ పౌరుడిగా కూడా ఆయన సాధారణ జీవితాన్ని గడిపి ఎందరికో ఆదర్శంగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు.

- స్థానిక ట్వింకిల్ స్కూల్లో కలామ్ విగ్రహానికి కరస్పాండెంట్ డి.శ్యామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. తమ పాఠశాల విద్యార్థులతో ఆయన గడిపిన క్షణాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగనంపూడి హైస్కూల్లో..

అగనంపూడి: అణ్వాయుధాలు, క్షిపణి రంగంలో భారతదేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ సేవలు ఎనలేనివని టీడీపీ గాజువాక నాయకుడు పల్లా కార్తీక్ అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని కలాం విగ్రహానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.వి.కృష్ణారావు, బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శి పులగపురి ఆశాలత, టీడీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, విశాఖ జిల్లా రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అబ్దుల్ కలాం వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పీలో కొత్త చూట్ ప్రారంభం



నూతన చూట్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన చూట్‌ను సీజీఎం మెయింటెనెన్స్ ఇన్‌చార్జి యు.శ్రీధర్ ప్రారంభించారు. పాత చూట్ స్థానంలో రూ.15 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ విభాగం అధికారులతో మాట్లాడుతూ విభాగం ఉత్పత్తి, మెయింటెనెన్స్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్త చూట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంలు పి.ఎస్.ఘోష్, ఎన్.వీరేశం, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునే యత్నం

- స్కూటీ పైనుంచి పడి ఒకరికి గాయాలు



గాయాలపాలైన రవి

పెదగంట్యాడ: పోలీసుల తనిఖీ నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి ఒక వ్యక్తి గాయపడ్డాడు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాలివి.. కేకేఆర్ వాటర్ ప్లాంట్ వద్ద శనివారం రాత్రి న్యూపోర్టు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా, బీసీ రోడ్ ప్రాంతానికి చెందిన ఎం.రవి స్కూటీపై వస్తూ పోలీసులను చూసి, వాహనాన్ని వెనక్కి తిప్పి తనిఖీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు పట్టుకునే ప్రయత్నంలో స్కూటీ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అతని కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. జరిగిన విషయాన్ని వారికి వివరించి, రవికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో ఆయన పూటుగా మద్యం సేవించి ఉన్నాడని తేలడంతో కేసు నమోదు చేశారు. అనంతరం చికిత్స చేయించారు. శనివారం మొత్తం ఐదు గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అమ్మ పేరుతో మొక్క

- విద్యార్థులకు సంరక్షణ బాధ్యత
- పాఠశాలల్లో సందడి



ఉక్కు కేవీలో తల్లితో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ వంశీ



లంకెలపాలెం స్కూల్ ఆవరణలో తల్లులతో కలిపి మొక్కలు నాటుతున్న విద్యార్థులు



మింది జెడ్పీ హై స్కూల్‌లో విద్యార్థులచే మొక్కలు నాటిస్తున్న ఉపాధ్యాయులు



కోరాడ ఎంపీపీ పాఠశాల ఆవరణలో మొక్కలతో నాయకులు,విద్యార్థులు



యారాడ పాఠశాలలో మొక్కలతో విద్యార్థులు

అగనంపూడి: అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకున్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. మిషన్ ఫర్ లైఫ్‌లో భాగంగా ఎకో క్లబ్‌ల ఏర్పాటు, కమిటీల నియామకం చేపట్టారు.

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు తల్లులతో కలిసి 105 మొక్కలు నాటారు. కిచెన్ గార్డెన్ మొక్కలు నాటారు. నీడను, అందాన్నిచ్చే మొక్కలు నాటి, వారికి బాలల తల్లుల నామకరణం చేశారు. వాటి సంరక్షణ బాధ్యతలను బాలలే స్వీకరించారు. హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ మిషన్ ఫర్ లైఫ్ ఉద్దేశం, పర్యావరణ పరిరక్షణలో ఎకో క్లబ్‌ల పాత్ర వివరించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కో–ఆర్డినేటర్లు బి.వి.సన్యాసిరావు, ఎస్.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెదముషిడివాడ, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి, అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో విద్యార్థులు తల్లులతో కలిపి మొక్కలు నాటారు.

యారాడ పాఠశాలలో..

పెదగంట్యాడ: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 64వ వార్డు యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 75వ వార్డు కోరాడ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జ్యోతి మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం కోరాడ ఎంపీపీ పాఠశాలలో గ్రామ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గేదల మధుసూదన్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మింది హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: మొక్కలు విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని 68వ వార్డు మింది జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీలో..

ఉక్కునగరం: స్థానిక కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో అమ్మ పేరుపై ఒక్క మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు వారి తల్లులతో కలిసి, విద్యాలయం పరిసరాల్లో మొక్కలు నాటారు. విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీ కృష్ణ తన తల్లితో పాల్గొని మొక్కను నాటారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం ద్వారా తల్లి లాంటి ప్రకృతిని కాపాడుకున్నవారం అవుతామన్నారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ సభ్యులు, విద్యాలయం ఉపాధ్యాయులు లలితాంబ, అల్కా రాణి మిశ్రా, జయంతితో పాటు స్కౌట్ సభ్యులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

1262వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



మాట్లాడుతున్న సిటూ నాయకుడు అయోధ్యరామ్

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పరిస్థితి దిగజారకముందే కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు సిటూ నాయకుడు అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలు శనివారానికి 1262వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ఉక్కు సిటూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పరిస్థితులు మారకపోవడం దారుణమన్నారు. టీడీపీ, జనసేనలు ఈ విషయంలో స్పందించకపోతే రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు సత్కారాలు



సంజీవరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావును స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సంజీవరావు కార్మిక పక్షపాతిగా అనేక ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, ఎన్నేటి రమణ, ఎస్.ఈశ్వరరావు, నల్ల శ్రీనివాస్, జి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు నేతృత్వంలో నాయకులు జీఎం సంజీవరావును సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం ఎస్. భాను, నాయకులు ఎం.కె.రెడ్డి, ఎం.గణపతి, పి.దానయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశునికి విశేష పుష్పార్చన



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి విశేష పుష్పాలతో అర్చన నిర్వహించారు. నిత్య పూజలు, తోమల సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశుని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.

ఐటీఐ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

- పారిశ్రామిక వేత్తల సహకారం



మాట్లాడుతున్న లఘు ఉద్యోగ భారతి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు నైపుణ్య శిక్షణలో భాగంగా ఆటోనగర్‌లోని పరిశ్రమల్లో ఆయా ట్రేడ్‌లలో శిక్షణకు పూర్తి సహకారం అందిస్తామని లఘు ఉద్యోగ భారతి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎ.కె.బాలాజీ తెలిపారు. ఆటోనగర్ బీ బ్లాక్‌లోని సెయింట్ అలాషియెస్ ఐటీఐలో లఘు ఉద్యోగ భారతి ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ప్రిన్సిపాల్, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన రాష్ట్రంలో 538కి పైగా ఐటీఐ కళాశాలలు ఉన్నాయన్నారు. నేషనల్ లఘు ఉద్యోగ భారతి ఆదేశాల మేరకు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల నైపుణ్యం, ఉపాధి తదితర అంశాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. ఐటీఐ కళాశాలలో శిక్షణ నిర్వహించే పలు విభాగాలను పరిశీలించారు. ఐటీఐలో విద్యార్థులను సమావేశ పరిచి, వారికి ఇంకా ఏ కావాలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు ప్రాక్టికల్స్‌కుసింకా ఎక్కువ సమయం కావాలని తెలిపారు. తమ ఐటీఐకు తోడ్పాటు అందించనున్న పారిశ్రామిక వేత్తలకు, లఘు ఉద్యోగ భారతి ప్రతినిధులకు ఐటీఐ మేనేజర్ కొండారెడ్డి నూసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లఘు ఉద్యోగ భారతి విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు అట్లూరి రమేష్, ఉపాధ్యక్షుడు సత్యబాబు, ప్రతినిధులు నవీన్, పవన్ జైస్వాల్, శివప్రసాద్, దీపక్, సీనియర్ పారిశ్రామిక వేత్తలు శేషగిరి రావు, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.